వరుస చోరీలతో బెంబేలు



పాలకుర్తిలో సీసీ కెమెరాలో రికార్డు అయిన గుర్తుతెలియని దొంగలు



పాలకుర్తి : బమ్మెరలో ఆగమ్మ ఇంటి వద్ద విచారణ జరుపుతున్న సీఐ, ఎస్సై

- వృద్ధ మహిళలే టార్గెట్
- వరుసగా నాలుగు చోరీలు, దొరకని దొంగలు

పాలకుర్తి టౌన్: జల్సాలకు అలవాటు పడిన కొంత మంది యువకులు డబ్బు సంపాదన కోసం నేరప్రవృత్తిని ఎంచుకుంటున్నారు. ఒంటరి వృద్ధ మహిళలను లక్ష్యంగా చేసుకొని బంగారు గొలుసు దొంగతనాలకు పాల్పడుతున్నారు. మండలంలో ద్విచక్రవాహనాలపై తిరుగుతూ మహిళల మెడలోని ఆభరణాలు లాక్కెళ్తున్న సంఘటనలు పెరుగుతున్నాయి.

వ్యసనాలకు బానిసై..

యువత జల్సాలకు, మద్యం, గంజాయి వంటి వ్యసనాలకు బానిసలవుతున్నారు. మాస్కులు, హెల్మెట్‌లు ధరించి నంబర్‌ప్లేటు లేని ద్విచక్ర వాహనాలపై తిరుగుతూ చోరీలకు పాల్పడుతున్నారు. ఒంటరిగా ఉన్న ఇళ్లలో వృద్ధ మహిళలను లక్ష్యంగా ఎంచుకుంటున్నారు.

బైక్‌లకు లేని నంబర్ ప్లేట్లు

బంగారు గొలుసు చోరీల్లో నంబర్‌ప్లేట్ లేని వాహనాలదే ప్రధాన పాత్ర, సీసీ కెమెరాలో నమోదైనా నంబర్ లేక, ముఖం కనిపించక నేరస్తులను పట్టుకోవడం కష్టతరంగా మారుతోంది. మండలంలో జరిగిన మూడు చోరీల్లో దొంగల ఆచూకీ లభించలేదు. అప్పుడప్పుడు పోలీసులు తనిఖీలు నిర్వహించి జరిమానాలు విధిస్తున్నా నంబర్‌లేని వాహనాలు తిరుగుతూనే ఉన్నాయి,

అప్రమత్తంగా ఉండాలి

నిర్మానుష్య ప్రాంతాల్లో ఒంటరిగా నడుకుంటూ వెళ్లే మహిళలు అగంతకుల విషయంలో అప్రమత్తంగా ఉండాలి. హెల్మెట్, మాస్క్ ధరించి ద్విచక్ర వాహనాలపై వచ్చే వారికి దూరంగా ఉండాలి. ఒంటరిగా ఉన్నప్పుడు ఎవరైనా చిరునామా చెప్పాలని అడిగే వారిపై జాగ్రత్తగా ఉండాలి. ఒంటరిగా ఉన్నప్పుడు ఆభరణాలు, గొలుసులు కనిపించకుండా మెడ చుట్టూ కొంగు, స్కార్ఫ్ వంటివి ధరించాలి.

పెరుగుతున్న నేరాలు

మే 18న మండలంలోని గూడూరులో వృద్ధురాలు మాచర్ల గౌరమ్మ మధ్యాహ్నం వాకిట్లో కూర్చుని ఉండగా ఇంట్లో మరుగుదొడ్డి తలుపులు బాగు చేస్తామని ఇంట్లోకి వచ్చి ఇద్దరు వ్యక్తులు ఆమెను మాటల్లో దింపి గౌరమ్మ మెడలో నుంచి మూడు తులాలు బంగారు పుస్తెలతాడును లాక్కుని పారిపోయారు.

మే 29న పాలకుర్తిలో ఒంటరిగా ఉన్న వృద్ధురాలు చిట్యాల లింగమ్మ ఇంట్లో ఇద్దరు బైక్‌పై వచ్చి ఇంట్లో చొరబడి ఆమె మెడలోని బంగారు గొలుసు, నల్లపూసల గొట్టాలు అపహరించారు. వృద్ధురాలిని పట్టుకొని దాడి చేయబోగా ఆమె అరుపులతో బైక్‌పై పారిపోయారు.

ఆగస్టు 2న పాలకుర్తిలో ఎడవెల్లి ఉప్పలమ్మ ఇంట్లో ఒంటరిగా ఉండడం గుర్తించిన గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి బంగారు గొలుసు, మెడలోని నల్లాపూసల గొలుసు, రూ.70 వేల నగదు తీసుకొని పారిపోయారు.

బమ్మెరలో మహిళ మెడలోని గొలుసు చోరీ

పాలకుర్తి: మండలంలోని బమ్మెరలో బట్టు ఆగమ్మ మెడలోని ఒక తులం నల్ల గొలుసును గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం మధ్యాహ్నం ఎత్తుకెళ్లిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. బాధితులి ఫిర్యాదు మేరకు ఆమె ఇల్లు చుట్టు పక్కల వారిని విచారణ చేస్తున్నామని సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్సై ప్రసన్న కుమార్‌లు తెలిపారు.

యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో రాజేశ్‌ను గెలిపించాలి



కొడకండ్ల: మాట్లాడుతున్న సత్యనారాయణ

కొడకండ్ల : పాలకుర్తి నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్ష పదవి కోసం నామినేషన్ వేసిన దరావత్ రాజేశ్‌నాయక్‌కు యూత్ నాయకులంతా మద్దతు పలికి గెలిపించాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ కోరారు. ఆదివారం స్థానిక మార్కండేయ ఫంక్షన్‌హాల్‌లో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సురేశ్‌నాయక్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఆన్‌లైన్ ఓటింగ్‌లో తప్పులు లేకుండా నిబంధనల ప్రకారం ఓటువేయాలన్నారు. సమావేశంలో నాయకులు అబ్బుల్లా, భిక్షపతి, సునీల్ రెడ్డి, అమరేందర్‌రెడ్డి, మధుసూదన్, రవీందర్, వెంగల్‌రావు, అంజయ్య, మనోహర్, వెంకన్న, శ్రీకాంత్, వంశీకృష్ణ, సుమన్, తదితరులు పాల్గొన్నారు.

పనిచేసే వారికి మద్దతు తెలపాలి

దేవరుప్పుల : అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి గెలుపుకోసం అంకితభావంతో పనిచేసిన ఉప్పుల అనిల్‌కు మద్దతు తెలపాలని కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు పెద్ది కృష్ణమూర్తి, ఇప్ప పృథ్వీరెడ్డి ఒక ప్రకటనలో కోరారు. త్వరలో జరుగబోయే కాంగ్రెస్ యూత్ ఎన్నికల్లో మండల అధ్యక్షుడిగా అనిల్‌కుమార్‌ను గెలిపించాలని అన్నారు. ఏఐసీసీ ఆదేశాల మేరకు ప్రజాస్వామ్యయుతంగా జరిగే యూత్ ఎన్నికల్లో పోటీచేసే హక్కు ప్రతి ఒక్కరికి ఉంటుందనీ, పోటీలో ఉన్న వారిని సమన్వయంతో ఏకాభిప్రాయం తీసుకవచ్చి పార్టీ కోసం పనిచేసిన వారికి పట్టం గడితే స్వాగతిస్తామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే టీపీసీసీకి ఫిర్యాదు చేస్తామన్నారు.

ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి

పాలకుర్తి: ప్రతి సోమవారం జరిగే ప్రజావాణి,గ్రీవెన్స్ కార్యక్రమాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఎస్. శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. ప్రతీ సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి జనగామ కలెక్టర్ ఆదేశాల మేరకు ఉంటుందని తెలిపారు. ప్రజలు తమ సమస్యలను కాగితంపై రాసి తమకు అందజేయాలని కోరారు

ప్రజా సమస్యలను పరిష్కరించాలి



చిల్పూరు: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టిసారించడం లేదని బీజేపీ రాష్ట్ర నాయకుడు బొజ్జపల్లి సుభాష్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం బీజేపీ మండల కార్యవర్గ సమావేశం పార్టీ మండల అధ్యక్షుడు గంటె ఉపేందర్ యాదవ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సుభాష్ మాట్లాడుతూ ప్రస్తుతం ప్రజలు, రైతులు ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు. అనంతరం మండలానికి చెందిన కొన్ని డిమాండ్లపై ఏకగ్రీవ తీర్మాణం చేశారు. సమస్యలపై చేసిన తీర్మాణాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి తోకల సంపత్‌రెడ్డి, ఓబీసీ మోర్చ జిల్లా అధ్యక్షుడు బాల్నె శ్రీనివాస్‌గౌడ్, నాయకులు తోట శ్రీనివాస్, గుగులోతు మధునాయక్, పెండ్యాల దిలీప్, వెలిశాల శ్రీనివాస్, ముక్కెర శ్రవణ్, కొర్నెల్, కట్ల అనీల్, శ్రీనివాస్, అశోక్, రాజేశ్వర్‌రెడ్డి, వేణు, రాజు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కరెంటు స్తంభానికి తీగల పందిరి



బచ్చన్నపేట : మండలంలోని వీఎస్‌ఆర్ నగర్ నుంచి ఆలింపూర్ గ్రామాల మధ్య రైతుల బావివద్ద కరెంటు స్తంభానికి తీగలు అల్లుకొని పందిరిలా తయారైంది. 11 కేవీ కరెంటు స్తంభానికి తీగలు దట్టంగా అల్లుకొని విద్యుత్ సరఫరాకు పలుమార్లు అంతరాయం కలిగిస్తున్నాయి. అధికారులు పలుమార్లు స్తంభాల వెంబడి తిరిగి తీగల కింద ఉన్న చెట్లు తాకకుండా కొటివేశారు. కానీ ఆ అధికారులకు ఈ తీగలు కనిపించడం లేదా అని పలువురు రైతులు అంటున్నారు.

సంక్షిప్తం సమాచారం

శ్రీనివాసశర్మ కుటుంబాన్ని ఆదుకుంటాం



దేవరుప్పుల : ఆధ్యాత్మికత చింతనతోపాటు విద్యాభివృద్ధికి పాటుపడిన మోటకొండూరు శ్రీనివాసశర్మ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నా రు. ఆదివారం మండలంలోని పెద్ద మడూరుకు చెందిన ప్రముఖ పూజారి శ్రీనివాస శర్మ గుండెపోటుతో మృతిచెందగా ఆమె బాధిత కుటుంబాన్ని పరా మర్శించి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. మృతుడి భార్య ఐసీడీఎస్ సూపర్ వైజర్ నవనీతను ఓ దార్చి అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఆమె వెంట కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి తో టకూరి పాండు కృష్ణ, గ్రామ పార్టీ అధ్యక్షుడు పురుషోత్తం, మండల నాయకులు నారెడ్డి సైదిల్‌రెడ్డి, పరుశరాములు, జలంధర్, రవీందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నర్సింహులు, మారయ్య ఉన్నారు.

పరశురాములు మృతి పార్టీకి తీరనిలోటు

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కట్ట పరశురాములు మృతి పార్టీకి తీరని లోటని కాంగ్రెస్ మండల అధ్యక్షులు నల్ల శ్రీరాములు అన్నారు. ఆదివారం మండలంలోని నీర్మాలకు చెందిన పరశురాములు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గ్రామశాఖ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి పాండు కృష్ణ, బీసీ,ఎస్సీ, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు గణేష్, యాకస్వామి ఉన్నారు.

సంతాపం

పరుశరాములు అకాల మృతిపై కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షుడు, పీఏసీఎస్ డైరెక్టర్ పెద్ది కృష్ణ మూర్తి సంతాపం వ్యక్తం చేశారు. ఓయూ జేఏసీ వ్యవస్థాపక సభ్యుడు పృథ్వీరెడ్డి రమేశ్, మహేందర్, షబ్బీర్ అనిల్ ఉన్నారు.

మాజీ జెడ్పీటీసీ పరామర్శ

జఫర్‌గఢ్: మండలంలోని సాగరం గ్రామానికి చెందిన కొంతం కుమారస్వామి అకస్మికంగా మృతి చెందిన విషయం తెలుసుకున్న మాజీ జెడ్పీటీసీ ఇల్లందుల బేబి శ్రీనివాస్ బాధిత కుటుంబాన్ని ఆది వారం పరామర్శించారు. ఆమె వెంట మాజీ సర్పంచ్ ఇన్నారెడ్డి, చేతన్ ఉన్నారు.

జఫర్‌గఢ్: మండలంలోని తమ్మడపల్లి (జి)కి చెందిన భవన నిర్మాణ కార్మికుడు బత్తిని ఎల్లయ్య గుండెపోటుతో మృతి చెందగా విషయం తెలుసుకున్న భవననిర్మాణ కార్మిక సంఘం జిల్లా నాయకులు వాతల యాదగిరి, నాయిని రామస్వామి, పిన్నింటి నర్సింహరాములు కార్మిక బృందంతో కలిసి బాధితుడి కుటుంబాన్ని ఆదివారం పరామర్శించారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

చిల్పూరు : మండలంలోని శ్రీపతిపల్లికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు గుర్రపు రామయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. ఇదే గ్రామానికి చెందిన మోతె రవి కుమార్తె భవాని అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న పార్టీ మండల నాయకుడు మాలోతు రాజు ఆదివారం ఒక్కో కుటుంబాన్ని పరామర్శించి రూ. 3 వేల నగదు, 50 కిలోల బియ్యం చొప్పున అందజేశారు. పార్టీ గ్రామ అధ్యక్షుడు నరేష్, మహేష్, చంద్రయ్య, వెంకట య్య, యాదగిరి, ఉపేందర్, రవి ఉన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని తాటికొండకు చెందిన మావురపు యాదగిరి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధితుడి కుటుంబానికి ఆదివారం మాజీ వైస్ ఎంపీపీ చల్లా సుధీర్ రెడ్డి, మాజీ సర్పంచ్ చల్లా ఉమా రూ.5వేలు ఆర్థిక సాయం అందించారు.



బచ్చన్నపేట : మండల కేంద్రంలో మృతి చెందిన పలువురు కుటుంబాలకు కేబీఆర్ ఫౌండేషన్ చైర్మన్ కొండి వెంకట్‌రెడ్డి ఆదివారం ఆర్థికసాయం అందించారు. ఇటీవల మృతి చెందిన రాగిశెట్టి లక్ష్మమ్మ, టేకులపల్లి యాదమ్మ, ఎల్లమ్మ కుటుంబాల సభ్యులను పరామర్శించి ఒక్కొక్కరికి రూ. 5వేల చొప్పున అందించారు. ఆయన వెంట నాయకులు ఆంజనేయులు, ఎల్లయ్య, నర్సింగారావు, భిక్షపతి, తదితరులు ఉన్నారు. అలాగే కొన్నె గ్రామానికి చెందిన చీర నరేశ్ అనా రోగ్యంతో బాధపడుతుంగా ఆస్పత్రి ఖర్చులకు గ్రామ సామాజిక సేవాకర్త కోడూరి శివకుమార్‌గౌడ్ రూ. 5వేలను అందజేశారు.

పాలకుర్తి టౌన్: పెట్టిన పెట్టుబడులు రాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులతో పాలకుర్తికి చెందిన శ్రీ మంజునాథ ఫెర్టిలైజర్ వ్యాపారి సతేంద్ర సోమశేఖర్ ఇటీవలే ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం మండల ఫెర్టిలైజర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడు అడ్డూరి భూపాల్ రావు, ఉపాధ్యక్షుడు బత్తుల వెంకన్న, నజీర్‌లు కలిసి బాధిత కుటుంబానికి రూ. 21 వేల ఆర్థిక సాయం అందజేశారు.

నిబద్ధతతో విధులు నిర్వహిస్తేనే గుర్తింపు



రఘునాథపల్లి : నిబద్ధతతో విధులు నిర్వహిస్తే ప్రజల్లో తగిన గుర్తింపు లభిస్తుందని ఎంపీఓ వెంకటేశ్వర్లు అన్నారు. బదిలీ అయిన మండలంలోని అయ్యవారిగూడెం, శివాజీనగర్, గిద్దబండతండా, మాధారం, మంగళిబండతండా గ్రామపంచాయతీల కార్యదర్శులు కనకం విజయ్, భానుప్రియ, రమేశ్, నర్మద, రాజీవ్‌లను శనివారం రాత్రి మండల పరిషత్ కార్యాలయంలో సహచర పంచాయతీ కార్యదర్శులు, మండల అధికారులు ఘనంగా సన్మానించారు. ఎంపీఓ మాట్లాడుతూ ప్రతి ఉద్యోగికి బదిలీ తప్పదని ఎక్కడ పని చేసినా విధులు సమర్థవంతంగా నిర్వహించి మంచిపేరు తెచ్చుకోవాలని సూచించారు.

మత్తు పదార్థాలు అమ్మితే కఠిన చర్యలు




సింగరాజుపల్లిలో పాన్‌షాపు వద్ద గుట్కాలు పట్టుకున్న పోలీసులు

దేవరుప్పుల : నిషేధిత మత్తు పదార్థాలు అమ్మితే చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయని ఎస్సై ఊర సృజన్‌కుమార్ హెచ్చరించారు. ఆదివారం సాయంత్రం మండలంలోని సింగరాజుపల్లిలో పలు దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. చౌరస్తాలో పాన్‌డబ్బా నిర్వహిస్తున్న భాషిపాక ప్రదీప్ దగ్గర రూ.1500 విలువ చేసే గుట్కా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల్లో కానిస్టేబుల్ మసూద్, కుమారస్వామి తదితరులు ఉన్నారు.

శ్రావణం.. శుభప్రదం

- నెల రోజుల పాటు ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- ముస్తాబవుతున్న దేవాలయాలు



జనగామ: ఆలయాల్లో శ్రావణ శోభ ఉట్టిపడుతుంది. నేటి (సోమవారం) నుంచి శ్రావణ మాసం ప్రారంభమవుతున్న నేపథ్యంలో జిల్లాలోని ఆలయాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. నెల రోజుల పాటు జరిగే శ్రావణ వేడుకలతో దేవాలయాలతో పాటు ఇళ్లలో పండగ శోభ సంతరించుకుంది. వచ్చే తొలి శుక్రవారం నుంచి మహిళలు వరలక్ష్మి వ్రతం ఆచరించడం ప్రారంభిస్తారు.

ఆలయాలకు శ్రావణ శోభ

జిల్లాలోని జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి నియోజకవర్గాల పరిధిలో శ్రావణ శోభ సంతరించుకుంది. జనగామ పట్టణం బాణాపురం వెంకటేశ్వర స్వామి, సంతోషిమాత, రామలింగేశ్వర స్వామి, గుండ్లగడ్డ ఉమా మహేశ్వర స్వామి, చెన్నకేశ్వరస్వామి, చిల్పూరు బుగులోని వేంకటేశ్వర, లింగాలఘణపురం మండలం జీడికల్ సీతారామచంద్రాస్వామి, బచ్చన్నపేట మండలం కొడవటూరు సిద్దులగుట్ట తదితర ఆలయాలు శ్రావణ మాస శోభను సంతరించుకున్నాయి. పవిత్రమైన శ్రావణ మాసం పురస్కరించుకుని ఆలయాల్లో ప్రత్యేక పూజలతో పాటు లక్ష్మీదేవీ వ్రతాలు, ఉప వాస దీక్షలు, మొక్కుల చెల్లింపులు తదితర పూజా కార్యక్రమాలు జరుగుతాయి.



పూజసామగ్రి సిద్ధం

ఆషాఢం ముగిసి.. శ్రావణమాసంలో అడుగిడుతున్న సందర్భంగా పూజసామగ్రి, పూలు, పండ్ల కొనుగోలుతో దుకాణాలన్నీ కిటకిటలాడుతున్నాయి. లక్ష్మీదేవీ అమ్మవారి వ్రతం కోసం కలవ పూలను ఆర్డర్ల మీదుగా హైదరాబాద్ నుంచి తెప్పిస్తున్నారు. ఆషాఢ మాసంలో వ్యాపారాల లేక బోసిపోయి కనిపించిన దుకాణాలు.. కస్టమర్లతో కిటకిటలాడనున్నాయి.

అన్ని బంధాల కంటే స్నేహం గొప్పది



పాలకుర్తి: ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు



జనగామ : స్నేహితుల దినోత్సవ వేడుకల్లో పిల్లలు

బచ్చన్నపేట : సమాజంలో అన్ని బంధాల కంటే స్నేహ బంధం గొప్పదని పీఏసీఎస్ చైర్మన్ పులిగిల్ల పూర్ణచందర్ అన్నారు. ఆదివారం స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకొని కేక్ కట్ చేసి స్వీట్లను పంపిణీ చేసి సంబురాలను జరుపుకున్నారు. సీఈఓ కాశ బాలస్వామి, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

స్నేహితుడికి అండగా బాల్యమిత్రులు

పాలకుర్తి: స్నేహితుడికి అండగా బాల్యమిత్రులు నిలిచారు. స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం 1984–85 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు బాల్యమిత్రుడికి అండగా నిలిచారు. మండలంలోని ఎల్లరాయని తొర్రూరు గ్రామానికి చెందిన లొంక మల్లేశ్‌తో పాటు అతని భార్య సాంబలక్ష్మి దంపతులిద్దరూ పక్షవాతంతో బాధపడుతున్నారు. అయినవోలు మండలం పున్నేలు గ్రామ శివారులోని శ్రీ కనకదుర్గ వృద్ధాశ్రమంలో ఉంటుండగా మాజీ జెడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాస రావు, వెలమ సంక్షేమ సంఘం జిల్లా డైరెక్టర్ వీరమనేని సోమేశ్వర్‌రావు ఇరిగేషన్ ఏఈ చిట్యాల యాకయ్యలతో పాటు చిన్ననాటి మిత్రులు ఆర్థికసాయం అందజేశారు. వృద్ధాశ్రమంలో పండ్లు, బ్రెడ్లు అందజేశారు. చారగొండ్ల సదానందం,సీహెచ్.లింగమూర్తి, రత్నాకర్, జీడి మనోహర్ పాల్గొన్నారు.

చిల్పూరు: వివిధ ఉద్యోగాల నిమిత్తం ఎక్కడెక్కడో ఉన్న వారు ప్రతీ సంవత్సరం స్నేహితుల దినోత్సవం రోజు ఒక్కటై కలుసుకుంటారు. ఆదివారం మండలంలోని మల్కాపూర్‌లో పోలెపల్లి రంజిత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఒక్కటై ఘనంగా స్నేహితుల దినోత్సవం నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో వెన్నం మాధవరెడ్డి, అలుగు అశోక్, రవి, మల్లేశం, అంబిత్, నాగరాజు, ప్రవీణ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల సంబురాలు

జనగామ: పట్టణంలోని న్యూ వావ్‌కిడ్స్ స్కూల్‌లో ఆదివారం స్నేహితుల దినోత్సవ వేడుకలను జరుపుకున్నారు. ప్రిన్సిపాల్ మోతె స్వప్న ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో స్నేహితుల విలువను చాటి చెప్పే విధంగా పిల్లలకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ సుమలత, శ్రావణి, దివిజ, లాస్యశ్రీ, సువర్ణ ఉన్నారు.

బతుకమ్మకుంటలో..

జిల్లా కేంద్రం బతుకమ్మకుంటలో వాకర్స్ ఆధ్వర్యంలో ఆదివారం స్నేహితుల దినోత్సవ వేడుకలను నిర్వహించారు. నారోజు రామేశ్వరాచారి, మోర్తాల ప్రభాకర్, రవీందర్‌రెడ్డి, రవి, పోషయ్య, సత్యం, శ్రీనివాస్ తదితరులు ఒకరికొరకు స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

షాపుల్లో యూరియా సిద్ధం

పాలకుర్తి టౌన్: యూరియా అన్ని షాపుల్లో విక్రయానికి సిద్ధంగా ఉందని ఏఓ కాకి శ్రీనివాస్‌రెడ్డి తెలి పారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మన మండలంలో సాగవుతున్న పత్తి, వ్యవసాయ విస్తీర్ణానికి సరిపోయే విధంగా యూరియా ఉందన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రాథమిక వ్యవసాయ సంఘాల సహకార సంఘాల వద్ద 140 టన్నుల యూరియా, ఎరువుల డీలర్లు, అగ్రోస్‌ల వద్ద 200 టన్నుల యూరియా ఉందని అన్నారు. 7288 894733 నంబర్‌కు సంప్రదించవచ్చని తెలిపారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

జనగామ రూరల్: వీవర్స్ కాలనీలోని పద్మశాలి యువజన సంఘం ఆధ్వర్యంలో ఆగస్టు 15 స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం మినీస్టేడియం ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు ప్రారంభించారు. కార్యక్రమానికి 12 వార్డు కౌన్సిలర్ గుర్రం భూలక్ష్మి నాగరాజు పాల్గొని పోటీలను ప్రారంభించారు. ఈ పోటీలకు 4 టీమ్‌లు పాల్గొంటున్నాయని గెలుపొందిన టీమ్‌కు రూ.5,116 నగదు బహుమతి అందజేస్తున్నట్లు సంఘం ప్రతి నిధులు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బేతి వెంకటేశ్వర్లు, గణేష్, హరినాథ్, శివ, వేణు, ఉపేందర్, సాకేత్, శ్రీకాంత్, వెంకటేష్, నాగరాజు, చైతన్య, తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతున్న మహిళ మృతి

కొడకండ్ల : మండలంలోని లక్ష్మక్కపల్లికి చెందిన వరికొప్పుల కవిత ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై బండి శ్రావణ్‌కుమార్ తెలిపారు. ఆరోగ్యం బాగా లేకపోవడంతో గ్రామంలోని ఆర్‌ఎంపీ వైద్యుడు అన్నం వెంకటేశ్వర్లు వద్ద ప్రాథమిక చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం ఏకశిల ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

బచ్చన్నపేట : బైక్ అదుపు తప్పి కిందపడిన రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలైన సంఘటన సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం వీరన్నపేట స్టేజీ -సలాక్‌పూర్ స్టేజీల మధ్య ఆదివారం చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. మండలంలోని కట్కూర్‌కు చెందిన ఏదు కనుకయ్య, రెడ్డెం విధేయ్‌కుమార్‌లు డీజిల్ కోసం బైక్‌పై చేర్యాల వైపు వెళ్తున్నారు. రోడ్డు పనులు జరుగుతుండగా బైక్ అదుపు తప్పి కిందపడిపోయింది. ఈ ప్రమాదంలో కనుకయ్యకు తీవ్రగాయాలు కాగా విధేయ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

ట్రాక్టర్ బ్యాటరీ చోరీ

నర్మెట: పలు ట్రాక్టర్ల బ్యాటరీలు చోరీకి గురైన సంఘటన మండలంలోని వెల్దండ, కన్నెబోయిన గూడెంలో శనివారం రాత్రి చోటు చేసుకోగా యజమానులు ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వెల్దండకు చెందిన రైతులు శాతెల్లి రాజు, శ్రీకాంత్, నర్మెట భాస్కర్, కాసర్ల సత్యనారాయణ, బొడుగం అంజిరెడ్డి, కన్నెబోయిన గూడెంకు చెందిన కంతి రవి, రాజలింగం వ్యవసాయ పనులు ముగించిన అనంతరం తమ ట్రాక్టర్లను వ్యవసాయ బావులవద్ద, ఇళ్లముందు నిలిపి ఉంచారు. ఆదివారం ఉదయం పనులకు వెళ్లే క్రమంలో బ్యాటరీలు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై నైనాల నగేష్ తెలిపారు.

క్లుప్తంగా

అధికారులు చొరవ చూపాలి

చిల్పూరు: మండలంలో పేద ప్రజలు ఎక్కువగా భూ సమస్యలు ఎదుర్కొంటున్నారని వాటి పరిష్కారంలో రెవెన్యూ అధికారులు చొరవ చూపాలని సీపీఐ మండల కార్యదర్శి భువనగిరి కుమారస్వామి అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వ్యవసాయ భూముల ధరలు పెరిగిన నాటి నుంచి ఎక్కువగా ధరలు పెరగని సమయంలో కొన్న పేదలే ఇప్పుడు అప్పటి భూస్వాముల నుంచి ప్రతీ రోజు ఏదో ఒక గ్రామంలో సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. వారి పక్షాన న్యాయం ఉన్నా భూస్వాములకు గ్రామపెద్దలు అండగా ఉంటూ పేద వా రికే అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. ప్రతీ గ్రామంలో రెవెన్యూ గ్రామ సభలు ఏర్పా టు చేసి సమస్యలను తెలుసుకుని అర్హులకు న్యాయం చేయాలని కోరారు. లేనిపక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

షూటింగ్‌బాల్ మండల అధ్యక్షుడిగా రంజిత్‌రెడ్డి



రంజిత్‌రెడ్డి సతీష్

చిల్పూరు: షూటింగ్ బాల్ మండల అధ్యక్షుడిగా పోలెపల్లి రంజిత్‌రెడ్డి, చైర్మన్‌గా ఊరడి సతీ ష్‌ను ఎంపిక చేసినట్లు జిల్లా చైర్మన్ ఇనుగాల యుగేందర్‌రెడ్డి ప్రకటించారు. ఉపాధ్యక్షుడిగా అన్నెపు కుమార్, ప్రధానకార్యదర్శిగా గోనెల అజయ్, సహాయకార్యదర్శులుగా బోగి రమేష్, ఉద్దెమారి హరీశ్, కోశాధికారిగా బందారి రాజేష్‌తో కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు తెలిపారు.

బీజేవైఎం మండల అధ్యక్షుడిగా రాజేశ్‌రెడ్డి



స్టేషన్‌ఘన్‌పూర్: బీజేపీ అనుబంధ బీజేవైఎం (భారతీయ జనతా యువ మోర్చా) మండల అధ్యక్షుడిగా మండలంలోని కొత్తపల్లికి చెందిన మంద రాజేశ్‌రెడ్డిని నియమించినట్లు బీజేపీ మండల అధ్యక్షుడు సట్ల వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. రాజేష్‌రెడ్డి ఆదివారం స్టేషన్‌ఘన్‌పూర్‌లో విలేకర్లతో మాట్లాడుతూ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేస్తూ క్షేత్రస్థాయిలో పార్టీని మరింతగా బలోపేతం చేసేలా శాయశక్తులా కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకంతో బీజేవైఎం మండల అధ్యక్షుడిగా నియమించిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంత్‌రెడ్డికి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డికి, రాష్ట్ర నాయకులు బొజ్జపెల్లి సుభాష్, పలువురికి కృతజ్ఞతలు తెలిపారు.

ఆలయంలో పూజలు


స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని తాటికొండలో శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయంలో భక్తులు ఆదివారం ఘనంగా అభిషేకం పూజలు చేపట్టారు. అమావాస్య సందర్భంగా అర్చకులు జీడికంటి వరుణాచార్యులు ఆధ్వర్యంలో అమ్మవారికి అలంకరణ, అభిషేకం, నిత్య అర్చన కార్యక్రమాలకు భక్తిశ్రద్ధలతో చేపట్టగా భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేపట్టి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో భక్తులు పండుగ రాజేశ్వర్, పండుగ బుచ్చయ్య, బేతి రత్నాకర్‌రెడ్డి, రాజేందర్, వికాస్ తదితరులు పాల్గొన్నారు.

బీఎన్‌ఆర్‌కేఎస్ కమిటీ ఎన్నిక



రఘునాథపల్లి: మండలంలోని వెల్ది గ్రామంలో భవన నిర్మాణ రంగాల కార్మికులు ఆదివారం సమావేశమై నూతన గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం రాష్ట్ర ప్రచారకార్యదర్శి రాసమల్ల కొమురయ్య సమక్షంలో జరిగిన ఎన్నికలో అధ్యక్షుడిగా రాసమల్ల ఎల్లస్వామి, ప్రధాన కార్యదర్శి సింగపురం నరహరి, ఉపాధ్యక్షులు సంకె యాదగిరి, కోశాధికారి రాగుల ఎల్లయ్య, కార్యదర్శి సంకె సత్తయ్య, ప్రచార కార్యదర్శి మాయ పర్వతాలు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో కార్మికులు నర్సయ్య, దశరథ, ఉప్పలయ్య, బుచ్చిరెడ్డి, కుమార్, అనిల్, యాదగిరి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుస్తుల పంపిణీ



జనగామ రూరల్: భువనగిరి జిల్లా ఆలేరుకు చెందిన దూడల అండాలు వర్ధంతి సందర్భంగా కుమారుడు అశోక్ పట్టణంలోని రుద్రమాదేవి వృద్ధాశ్రమంలో వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. అలాగే పల్లపు నరేందర్‌రెడ్డి సరిత దంపతులు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పుట్టిన రోజు, వివాహ వేడుకలు ఇతర పండగలకు పేదలకు కొంతసాయం అందించాలని కోరారు. ఎస్.సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.